ఆగమాగం.. గందరగోళం

చివరిరోజు సైతం రసాభాసగా గ్రామసభలు

దరఖాస్తులు తీసుకునేందుకే పరిమితమైన అధికారులు

ఖమ్మంరూరల్ : ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో కుమార్

రఘునాథపాలెం : చెరువుకొమ్ముతండాలో పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

ఖమ్మంరూరల్, జనవరి 24 : మండలంలో చివరిరోజు శుక్రవారం నాలుగు గ్రామాల్లో జరిగిన గ్రామసభలు సైతం రసాభాసగానే ముగిశాయి. ఉదయం 9గంటలకు మండల కేంద్రం పెద్దతండా, ఏదులాపురం, చిన్నవెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. పెద్దతండా గ్రామానికి సంబంధించిన గ్రామసభ మండల కేంద్రం సాయిప్రభాత్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. సుమారు 11వేల ఓటర్లు, 20వేల జనాభా కలిగిన ఈ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభ ఆగమాగం, గందరగోళంగా మారింది. చివరిరోజున నిర్వహించిన గ్రామసభలు పెద్ద గ్రామాలు, సమస్యాత్మకం కావడంలో ప్రాథమిక జాబితాను సైతం చదివేందుకు అధికారులు విముఖత చూపారు. సభ ప్రారంభానికి ముందే ప్రాథమిక జాబితాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించినప్పటికీ అక్కడికి వచ్చిన ప్రజలు గుర్తించేందుకు వీలుకాకపోవడంతో అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదని గ్రామ ప్రజలు మైక్ చేతబట్టి తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా రైతుభరోసా నిధులు వానకాలం, యాసంగికి సంబంధించింది ఇస్తారా, సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విధంగా ఎకరానికి రెండు సీజన్లు కలిపి రూ.15 వేలు ఇస్తారా తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ప్రజలు అధికారులకు తమ సమస్యలు చెప్పుకునే ప్రయత్నం చేస్తుండడంతోనే అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్న సందర్భాలు కనిపించాయి. ఎంపీడీవో ఎస్.కుమార్, తహసీల్దార్ పీ రాంప్రసాద్ ప్రజలు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. మరోసారైన తమకు అవకాశం కల్పిస్తారేమోనని వందలాది మంది ప్రజలు వివిధ పథకాలకు మళ్లీ దరఖాస్తులు అందజేశారు.

దరఖాస్తులేనా.. పథకాల అమలెప్పుడు?

గ్రామసభలో అధికారులను నిలదీసిన జనం

రఘునాథపాలెం, జనవరి 24 : అప్లికేషన్లు పెట్టుకోవడంతోనే రోజులు నడిపిస్తరా.. ఇంకెప్పుడు పథకాలను అమలు చేస్తరని ప్రజలు గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని చెరువుకొమ్ముతండా, బావోజీతండా, కొర్లబోడు తండాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రభుత్వ పథకాలకు అప్లికేషన్ పెట్టినా జాబితాల్లో పేర్లు లేకపోవడంతో గ్రామసభలో ఆందోళన చేశారు. దీంతో కొర్లబోడు తండాలో కాసేపు గ్రామసభకు ఆటంకం కలిగింది. బావోజీతండాలో జాబితాలో పేర్లు లేవని పేదల తరపున ప్రశ్నించిన కారణంగా తేజావత్‌కుమార్ అనే బీఆర్ఎస్ నాయకుడిపై రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇల్లు, ఆత్మీయ భరోసా రెండూ రాలేదు..

నా భర్త చనిపోవడంతో కూలీ పనులకు వెళ్తున్నా. ఉండటానికి ఇల్లు కూడా లేదు. నేను ఇందిరమ్మ ఇల్లు, ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తు చేసుకున్నా. రెండు పథకాల్లోనూ నా పేరు రాలేదు. అందరికీ ఇళ్లు వస్తాయని చెప్పడంతో ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్నా. అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలో అర్థం కావడం లేదు.

– కొరగుంట్ల రాధ, కమలాపురం

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినా..

వరదలతో మా ఇల్లు మునిగింది. అప్పుడు డిప్యూటీ సీఎంకు గోడు చెప్పుకుంటే ఇందిరమ్మ ఇల్లు వస్తుంది.. దిగులు పడకు అని భరోసా ఇచ్చారు. అప్పుడే నాకు ఇల్లు వచ్చిందని ఎంతో సంతోషపడ్డా. ఈరోజు జరిగిన గ్రామసభలో నా పేరు రాలేదు. నాకు భూమి లేకపోయినా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయలేదు. నాకు తీవ్ర అన్యాయం జరిగింది.

– పెద్దపాంగు ఉప్పయ్య, న్యూలక్ష్మీపురం

స్థలం ఉన్నా ఇల్లు మంజూరు కాలేదు..

హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మధిరలో ఇంటి వద్ద ఫొటో దింపి.. అధికారులు స్థలం చూశారు. ఇప్పుడు అర్హుల జాబితాలో నా పేరు రాలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రజలను మోసం చేసేందుకు మరోసారి దరఖాస్తు చేసుకోమని చెప్పారు.

– నల్లబోతుల లక్ష్మీదుర్గ, మధిర

కూలీ చేసుకునే నాకు ఇల్లు రాలేదు..

నా భర్త చనిపోయి పదేళ్లు అవుతుంది. పిల్లలను సాకడానికి కూలీ పనులకు పోతున్న. సొంతిల్లు కావాలని దరఖాస్తు పెట్టుకున్నా ఇల్లు రాలేదు. మా తండాలో హైవే పక్కన కోట్ల విలువైన 5 ఎకరాలు ఉన్న వారికి ఇల్లు వచ్చింది. ఒంటరి మహిళనైన నాకు ఇల్లు రాలేదు. మా తండాలో అంతా ఉన్నోళ్లకు ఇళ్లు ఇచ్చారు. అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు పెట్టుకోమన్నారు. ఇప్పుడే రాలేదు. మళ్లీ వచ్చేది కూడా లేదు. మా బతుకులు మారేది లేదు.

– వడ్డ్యి పులమ్మ, గంగబండతండా కూసుమంచి

ఎంపీ వద్దిరాజు జన్మదిన వేడుకలు

ఖమ్మం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం, జనవరి 24 : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం(తెలంగాణ భవన్)లో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీ వద్దిరాజు కట్ చేయగా ఆయనకు తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో వద్దిరాజు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, వీరమోహన్‌రెడ్డి, బాలాజీ, మురళీకృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి టౌన్, జనవరి 24: ఖమ్మం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిరంద్ర జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, బీఆర్ఎస్ నాయకులు మాధురి మధు, అమరవరపు కృష్ణారావు, నడ్డి ఆనందరావు, అద్దంకి అనిల్, చాంద్ పాషా, సూరిబాబు, గాదే సురేశ్, యాస రాంబాబు, యాకూబ్ పాషా, మిద్దె శ్రీను, దావూద్, శివ, పెద్దిరెడ్డి పురుషోత్తం, సుంకర వాసు, ఆళ్ళ నరేశ్, రామిశెట్టి కృష్ణ, తోకల సురేశ్, గొట్టిపల్ల రంగారావు, తూతా జగన్మోహనరావు, వీ.బాబు, ఎస్‌కే.బాబు, వినుకొండ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, జనవరి 24: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పుట్టిన రోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఎర్రుపాలెం మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీఎస్ సీడ్స్, జడ్పీ మాజీ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజు హాజరై కేకులు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఇలాంటి పుట్టిన రోజులను వద్దిరాజు మరెన్నింటినో జరుపుకుని ప్రజలకు మరింత సేవచేయాలని అభిలషించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు తుది షెడ్యూల్

ఖమ్మం అర్బన్, జనవరి 24 : తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు తుది షెడ్యూల్‌ను ప్రకటించినట్లు డీఈవో సోమశేఖరశర్మ, కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు అవకాశం ఉందని, ఇతర వివరాలకు 8008403522లో సంప్రదించాలని సూచించారు.

క్రీడల్లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన డిప్లొమా విద్యార్థులు జిల్లాస్థాయి పాలిటెక్నిక్ కబడ్డీలో విజేతగా నిలిచారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన ఈ పోటీల్లో మొదటి బహుమతి, లాంగ్‌జంప్‌లో తృతీయ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్ అభినందించారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

రఘునాథపాలెం, జనవరి 24 : జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. గురువారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఆలిండియా సర్వీసెస్ గేమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. ఇందులో బచ్చోడు హైస్కూల్ ఉపాధ్యాయుడు కొమ్ము విజయచందర్, మేడేపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఏపూరి రవికుమార్, నేలకొండపల్లిలో పనిచేసిన కనపర్తి కోటేశ్వరరావు ఎంపికయ్యారు.

పలు కుటుంబాలను పరామర్శించిన సండ్ర

వైరా టౌన్, జనవరి 24: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మండలంలోని పలు కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు. మండలంలోని బాలపేట గ్రామ మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నర్సింహారావు తండ్రి కోసూరి వీరయ్య, గొడ్ల మోసేయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సండ్ర బాలసూట గ్రామానికెళ్లి మృతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డం వీరమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, నాయకులు వజ్రాల రామిరెడ్డి, బద్దం కోటిరెడ్డి, దగ్గల శ్రీనివారెడ్డి, కోడూరు వీరకృష్ణ, పులి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేయాలి

వైరాటౌన్, జనవరి 24: రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల ధాన్యం క్వింటాకు ఇచ్చే రూ.500 బోనస్ రైతుల బ్యాంకు అకౌంటులో జమ చేయాలని, రూ.రెండు లక్షలు రుణమాఫీ పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైరా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాంబాబు, శ్రీనివాసరావు, చలపతిరావు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఉడాన్ క్రీడల ప్రారంభోత్సవం

పోటీలను ప్రారంభిస్తున్న ఏడీసీపీ నరేష్‌కుమార్, యాజమాన్యం

ఖమ్మం అర్బన్, జనవరి 24 : ఖమ్మం నగరంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్తా స్కూల్‌లో శుక్రవారం ఉడాన్ క్రీడల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, డీవైఎస్‌వో సునిల్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల మానసిక స్థితిని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయన్నారు. శనివారం జరిగే ముగింపు వేడుకలకు అర్జున అవార్డు గ్రహీత సిక్కిరెడ్డి పాల్గొననున్నారు. మొత్తం 1500 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకుని టెన్నిస్, అథ్లెటిక్స్, ఖోఖో, క్యారమ్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, సాయిగీతిక, రావూరి కరుణా సైదుబాబు, నాగరాజు, చేతన్‌మాధుర్, జయప్రకాష్, బాలకృష్ణ, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సీనియర్ మేట్‌పై చర్యలు తీసుకోవాలి

పెనుబల్లి(కల్లూరు), జనవరి 24: ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకంలో కల్లూరు మండలం చెన్నూరు గ్రామానికి అన్యాయం జరిగిందని, దీనికి కారణమైన సీనియర్ మేట్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంపీడీవోకు చెన్నూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆత్మీయ భరోసా జాబితాలో అసలైన నిరుపేదలకు న్యాయం జరగలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కోరపాటి వీరయ్య, లక్ష్మణరావు, రాములు, రాము, వెంకన్న, ఏసు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం అర్బన్, జనవరి 24 : ఫెడరల్ హక్కులను కాలరాసే, ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలకు యూజీసీ తెరలేపిందని, వీసీలను గవర్నర్లకు కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పీజీ కళాశాల ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యలో రాష్ట్రాల హక్కులను దెబ్బతీసి వారి స్వయం ప్రతిపత్తిని అణిచివేస్తున్నాయన్నారు. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివనాయక్, నాగుల మీరా, వంశీ, రాకేష్, రమ్య, శ్రావణి, సుజాత పాల్గొన్నారు.

బాలికలు గొప్ప లక్ష్యాలను సాధించాలి

జాతీయ బాలికల దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వ్యవసాయం, జనవరి 24 : బాలికలు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో బేటీ పడావో-బేటీ బచావో పోస్టర్లను ఆవిష్కరించారు. బేటీ పడావో-బేటీ బచావో కార్యక్రమానికి మద్దతుగా క్యాంపెయిన్ ఫ్లెక్సీపై సంతకం చేశారు. కొణిజర్ల మండలం తనికెళ్ల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థినులు కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌ను కలిసి ముచ్చటించారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌ను చూడాలని ఆశించిన విద్యార్థినుల కోరిక మేరకు కలెక్టర్ తన చాంబర్‌ను చూపించారు. చాంబర్‌లో కలెక్టర్‌లుగా పనిచేసిన వారి జాబితా చూపించి, ఖమ్మం జిల్లాలో గతంలో అనేకమంది గొప్ప అధికారులు కలెక్టర్లుగా పనిచేశారని, ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన సుబ్బారావు సైతం గతంలో జిల్లాలో సేవలు అందించారన్నారు. కలెక్టరెట్‌లో సుమారు 62 శాఖల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. చిన్న వయస్సులోనే పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఒక్కో మెట్టు ఎక్కుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. నేటి బాలికలకు ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తలుగా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, క్రీడాకారులుగా పెద్దస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి, డీఆర్వోవో రాజేశ్వరి, ఏవో ఎన్.అరుణ, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సమ్రీన్, పలువురు ఇతర అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌నగర్ పాఠశాలలో..

ఖమ్మం అర్బన్, జనవరి 24 : విద్యార్థినులకు చదువు ఆయుధంగా ఉపయోగపడుతుందని, చదువు మధ్యలో ఆపకూడదని, చదువుకుంటే ఏ వృత్తిలోనైనా రాణించవచ్చని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతరాణి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని వేణుగోపాల్‌నగర్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్‌లో...

బాలికా విద్యే భారతావని అభివృద్ధిలో సుస్థిరతకు భరోసానిస్తుందని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన రమాసత్యవతి, సునంద పాల్గొన్నారు.

తనికెళ్లలో..

కొణిజర్ల, జనవరి 24: తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద అడుగుల త్రివర్ణ పతాకంతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం పీడీ.శ్రీనివాస్, పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు గోపాలరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో...

తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 'వెబినార్ ఆన్ ఎంపవర్‌మెంట్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ గర్ల్స్' అనే కార్యక్రమాన్ని ఎన్ఐటి వరంగల్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీజీసీ కోఆర్డినేటర్ కె.రజిని, ప్రిన్సిపాల్ ఏ.రజిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, కేపీ.ఐశ్వర్య, ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఇంచార్జి బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

అడవిమల్లేలలో..

పెనుబల్లి, జనవరి 24: మండలంలోని అడవిమల్లేల సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతా జాగ్రత్తలపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఎన్ సుగుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, అనురాధ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కార్యదర్శులపై దాడులు..

పలువురిపై కేసులు

టేకులపల్లి/ రఘునాథపాలెం, జనవరి 24: టేకులపల్లి గ్రామసభలో తన విధులకు పలువురు ఆటంకం కలిగించారని, తనపై దాడి చేశారని సెక్రటరీ దీప్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి హెడ్ కానిస్టేబుల్ నర్సింహారావు తెలిపారు. అలాగే, రఘునాథపాలెం మండలం బావోజీతండా మహిళా కార్యదర్శితో అదే గ్రామానికి చెందిన తేజావత్ కుమార్ ఘర్షణ పడి ఆమె విధులకు ఆటంకం కలిగించడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

నేడు హైకోర్టు జడ్జిలు రాక

ఖమ్మం లీగల్, జనవరి 24 : ఖమ్మం జిల్లా కోర్టుకు శుక్రవారం ముగ్గురు హైకోర్టు జడ్జిలు రానున్నారు. ఖమ్మం కోర్టు ప్రాంగణంలో సెకండ్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవానికి హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్రీ సుధ, భీమపాక నగేష్, కే.శరత్ హాజరవుతున్నట్లు ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరేళ్ళ శ్రీనివాసరావు తెలిపారు.

శాంతినగరంలో కలాం స్ఫూర్తి యాత్ర..

డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం స్ఫూర్తితో 33 జిల్లాల్లో సాగుతున్న కలాం స్ఫూర్తి యాత్ర శుక్రవారం ఖమ్మం నగరంలోని శాంతినగర్ కళాశాలకు చేరుకుంది. యాత్ర బస్సులోని రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, ఏఐ వాటిని విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి అనుభూతి పొందారు. బృంద సభ్యులు మధులాష్‌బాబు, శ్రీజ, అర్చన, అజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యాలయం ప్రారంభం

ఖమ్మం అర్బన్, జనవరి 24 : ఖమ్మంలోని బైపాస్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా కార్యాలయాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను కలిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కొమ్మినేని అనిల్, ముత్తినేని సురేష్, వీరేంద్ర, సోందు, విష్ణు, ఇందిర పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి : మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 24 : ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్‌లో బల్లేపల్లి నుంచి బాలపేట వరకు చేపట్టిన రోడ్డు అభివృద్ధి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3.97 కోట్లతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని రోడ్డు విస్తరణ ఇండ్లు కోల్పోయిన పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. రూ.249 కోట్లతో డ్రైయిన్ పనులు ప్రారంభిస్తున్నామని వేసవికాలంలోపు ఈ పనులు పూర్తి చేయాలన్నారు. స్టాటర్ హౌస్ నిర్మాణానికి రూ.8 కోట్లు అందుబాటులో ఉన్నాయని దీనికి అనువైన స్థలాన్ని చూడాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.8.8 కోట్లు మంజూరు

కూసుమంచి, జనవరి 24: పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.8.8 కోట్లను మంజూరు చేశారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఇళ్లు, కాలనీలు, నివాస ప్రాంతాల మీదుగా వెళ్తున్న లైన్ల మార్పుల కోసం రూ.4.65 కోట్లు, కొత్త వీధుల్లో కొత్త లైన్ల కోసం రూ.4.23 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు సంబంధిత శాఖ జీవోను జారీ చేసింది.

రైతుభరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం రూరల్, జనవరి 24: ఇటీవల నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఉమా నగేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి నాటికి రెవెన్యూ శాఖ నుంచి పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇప్పటికే రైతుబంధు పొందుతున్న రైతులు తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

నేడు 'ఆట కావాలా.. పాట కావాలా'

ఖమ్మం, జనవరి 24 : ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 6 గంటలకు మొగిలి ఎంటర్‌టైన్మెంట్ వారి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి ప